



జోహార్.. ఎన్టీఆర్..!

అనంతపురంలోని జూనియర్ కళాశాల వద్ద పూలమాలలతో నిండిపోయిన ఎన్టీఆర్ విగ్రహం



అనంతపురంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అన్నా.. మీరే స్ఫూర్తి!

ఎన్టీఆర్‌కు తమ్ముళ్లు, అభిమానుల ఘన నివాళి

తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి.. అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడిన ఎన్టీఆర్‌ను ప్రజలు ఎన్నటికీ మరువలేరని అన్నారు. ఓట్ల కొనుగోలు.. సీట్ల అమ్మకాలు లేని రాజకీయాలను ఎన్టీఆర్ అమలు చేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మంచివారిని ఎన్నికల్లో గెలిపించాలని, అవినీతిపరులను పక్కన పెట్టాలని సినీ నటుడు శివాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పరిపాలనలో అనేక మార్పులు చేసిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని సినీ నటుడు నాగినీడు అన్నారు. అనంతపురంలో జరిగిన ఎన్టీఆర్ సంస్మరణ సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.





సినీనటులు శివాజీ, నాగినీడుకు సన్మానం



ఎన్టీఆర్ తెలుగువారి సొత్తు

సినీ నటుడు శివాజీ

అనంతపురం అర్బన్: ఎన్టీఆర్ ఏ పార్టీ వ్యక్తి కాదని, తెలుగువారి సొత్తు అని సినీనటుడు శివాజీ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో లలితకళా పరిషత్‌లో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రంగాల కళాకారులను ఘనంగా సత్కరించారు. సినీనటులు శివాజీ, నాగినీడు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... రాబోవు ఎన్నికల్లోనైనా ధైర్యంగా, నిజాయితీగా ఓటు వేయాలని కోరారు. దొంగ ఓట్లను ప్రశ్నించి, పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యావంతులు, పొలంలో పనిచేసే వారికి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా బీఫారం ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందని అన్నారు. ఈ రోజుల్లో 'సూట్ కేసు పట్టుకు రండి.. బీ ఫారం తీసుకెళ్లండి' అన్నట్లు



వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఏ రాజకీయ పార్టీతో తనకు సంబంధం లేదని, మంచి ఎక్కడ జరిగితే అక్కడకు వెళతానని, నాలుగు మంచి మాటలు మాట్లాడతానని అన్నారు. ఆడవారికి ఆస్తిలో సమాన హక్కు కల్పించి, చట్టం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. విద్య, వైద్యం, ఇళ్లు.. ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఎన్టీఆర్ చేసిన మంచి పనులను ప్రజలకు తెలియజేసే బాధ్యత తనలాంటి వారిపైన, ప్రజలపైన ఉందని అన్నారు. ఎన్టీఆర్ తన కుటుంబాన్ని రాజకీయాల్లోకి రానివ్వలేదని, అన్న.. బాబాయ్.. చెల్లెలు అందరూ రాజకీయాల్లోకి వచ్చి సహజ వనరులను దోచుకోండని ఆయన అనలేదని అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలని, ప్రజలను దోచుకునేవారిని పక్కనపెట్టాలని సూచించారు. తెలుగువారి ఉనికిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని సినీనటుడు నాగినీడు కొనియాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు పాలనలో పెనుమార్పులు తెచ్చిన వ్యక్తి ఆయన అని అన్నారు. తెలుగు ప్రజలంతా ఐక్యంగా ఉండాలని అన్నారు.



పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు తదితరులు

ఊపిరి ఉన్నంతవరకూ ఇక్కడే..!

మాజీ మంత్రి పరిటాల సునీత



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పరిటాలసునీత, టీడీపీ నాయకులు

రామగిరి, జనవరి 18: ఊపిరి ఉన్నంతవరకు ఎన్టీఆర్, నారా కుటుంబాలతోనే ఉంటామని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. పరిటాల రవీంద్రను ఎన్టీఆర్ రాజకీయాల్లోకి తెచ్చారని, ఆయన తరువాత చంద్రన్న తమకు అండగానిలిచి నడిపిస్తున్నారని అన్నారు. రామగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ఎంతో మందికి రాజకీయ భిక్ష పెట్టారని అన్నారు. ఆయన వల్లే చాలామంది కీలక పదవులు పొందారని అన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితోనే తాము ముందుకు వెళతామని అన్నారు. మరోసారి టీడీపీని గెలిపించి ఎన్టీఆర్‌కు నిజమైన నివాళులు అర్పిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, శ్రీరాములు నాయక్, మండల కన్వీనర్ సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నిజాయితీకి నిలువుటద్దం ఎన్టీఆర్: ప్రభాకర్ చౌదరి



అనంతపురం అర్బన్: నిజాయితీకి నిలువుటద్దం నందమూరి తారక రామారావు అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి కొనియాడారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఆయన ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. ఎన్టీఆర్ అవినీతికి ఆమడదూరంలో ఉండేవారని అన్నారు. సేవాభావంతో రాజకీయాలు చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ నిలిచిఉంటారని అన్నారు. యువత, అన్ని రంగాలవారు ఆయను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

ద్విదళ గాయకుడు వెంకోబరావును సత్కరిస్తున్న శివాజీ, కళాకారులు






నృత్యాలు చేస్తున్న కళాకారులు, హాజరైన నగరవాసులు



సత్కారమందుకుంటున్న తోలుబొమ్మల కళాకారులు దళవాయి చలపతి



ఖండే చిన్న అంజనమ్మ తోలుబొమ్మల చిత్ర కళాకారిణి..



ఆకులేడు నరసింహమూర్తి, రంగస్థల కళాకారుడు



పక్కీరప్ప, హార్మోనిస్టు



రామనాథం, రంగస్థల కళాకారుడు



ఓబులేసు, కొమ్ము కళాకారుడు



నారాయణరాజు, హరిదాసు కళాకారుడు

ఇదేం సమత..? ఇదేం సంకల్పం..?

ఉదయం రమ్మన్నారు.. మధ్యాహ్నమైనా రాలేదు
ఆహ్వానితులు వచ్చినా.. కనిపించని అధికారులు
'అంబేడ్కర్-సామాజిక న్యాయం' సభ తీరిది..!

అనంతపురం టౌన్, జనవరి 18: కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన 'సామాజిక సమతా సంకల్పం' కార్యక్రమం అతిథులకు విసుగు తెప్పించింది. ఉదయం రమ్మని చెప్పిన అధికారులు.. మధ్యాహ్నమైనా రాకపోవడంతో హాజరైనవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణను అవకాశంగా తీసుకుని.. దళితులను తమ వైపు తిప్పుకోవడానికి అధికార పార్టీ వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు 'సామాజిక సమతా సంకల్పం' పేరిట జిల్లా యంత్రాంగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో గురువారం వివిధ రంగాల ప్రముఖులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులతో 'అంబేడ్కర్-సామాజిక న్యాయం' పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సంక్షేమ శాఖల అధికారులు అందరికీ ఆహ్వానం పంపారు. పది నిమిషాలు అటూ ఇటుగా, దళిత సామాజికవర్గ మేధావులు, ప్రజాప్రతినిధులు కొందరే వచ్చారు. కుర్చీలు నిండుగా కనిపించేలా అనంతపురం, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల సచివాలయాల ఉద్యోగులను పిలిపించారు. 'ప్రెజెంట్ సార్' అన్నట్లుగా సచివాలయ ఉద్యోగులు ఫొటోలు దిగి.. తమ తమ అధికారుల గ్రూపుల్లో పోస్టు చేస్తూ కనిపించారు. ఇదంతా బాగానే ఉన్నా.. మధ్యాహ్నం 12 గంటలైనా కార్యక్రమం మొదలు కాలేదు. వచ్చినవారందరూ గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సంక్షేమ శాఖల అధికారులు లోపలికి, బయటకు తిరుగుతూ గడిపారు. నృత్య ప్రదర్శన కోసం వచ్చిన చిన్నారులు.. ఆ దుస్తులు, మేకప్ చెడిపోకుండా ఉండేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఆ సమయంలో కలెక్టర్, ఇతర అధికారులు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండటమే.. దీనంతటికీ కారణం. మధ్యాహ్నం 12 తరువాత జ్యోతి ప్రజ్వలన చేశారు. దళిత సామాజికవర్గ ప్రతినిధుల చేత ప్రసంగాలు చేయించారు. మధ్యలో కలెక్టర్ గౌతమి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు వచ్చారు. అంబేడ్కర్, రాజ్యాంగం గురించి ప్రసంగించారు. ఏదో ప్రభుత్వం చెప్పింది.. చేసేశాం.. అన్నట్లుగా కార్యక్రమాన్ని ముగించారు.



మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖాళీ కుర్చీలు

ఫీజు కడితేనే పరీక్ష..!

విద్యార్థులతో ఎస్కేయూ ఆట

నేటి నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, జనవరి 18: ఎస్కేయూ పీజీ పరీక్షలు రాయాలంటే ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సిందేనని వర్సిటీ యాజమాన్యం అంటోంది. ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యా దీవెన, వసతి దీవెన సొమ్మును తమ నుంచి వసూలు చేస్తే ఎలా విద్యార్థులు వాపోతున్నారు. ఇటు వర్సిటీ, అటు ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. విద్య, వసతి దీవెనలను నాలుగు విడతలుగా చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఒకటి, రెండు విడుతలతో సరిపెడుతోంది. దీంతో తమకు ప్రభుత్వంపై నమ్మకం లేనట్లుగా.. ఆ సొమ్ము చెల్లించాల్సిందేనని వర్సిటీ యాజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి తెస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు మొదలవుతున్నాయి. పీజీ విద్యార్థులకు ఇప్పటికి ఆరు విడతల సొమ్ము చెల్లించాల్సి ఉండగా.. మూడు విడతలు మాత్రమే అందిందని విద్యార్థులు వాపోతున్నారు. రూ.40వేల వసతి దీవెనకు గాను రూ.10 వేలు మాత్రమే చెల్లించారని, దీంతో మిగిలిన సొమ్ము తాము చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

వసూళ్లకు ప్రత్యేక అధికారి

వీసీగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే ఫీజు వసూళ్లకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిని నియమించారు. ప్రభుత్వంతో తమకు సంబంధం లేదని, ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని అప్పట్లోనే విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారు. మెస్ బిల్లులు, ట్యూషన్ ఫీజులు చెల్లించేవరకు హాల్ టికెట్స్ ఇవ్వలేదు. నోడ్యూస్ సర్టిఫికెట్ సమర్పిస్తేనే పరీక్షలకు అనుమతించారు. అదే అరాచకం ఇంకా కొనసాగుతోందని విద్యార్థులు మండిపడుతున్నారు.

పరిశీలిస్తాం: వీసీ హుస్సేన్‌రెడ్డి

వర్సిటిలో ఏం జరుగుతోందో పరిశీలిస్తాను. బాధ్యతలు స్వీకరించి రెండురోజులు కూడా కాలేదు. అన్ని విభాగాల పనితీరును ఒక్కొక్కటిగా సమీక్షిస్తాను. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆ దిశగా నిర్ణయాలు తీసుకుంటాను.

రూ.1.75 కోట్ల నగదు స్వాధీనం

విడపనకల్లు, జనవరి 18: మండల కేంద్రం సమీపంలో.. కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1.75 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన పందాల క్రిష్టారెడ్డి కారులో రూ.1.75 కోట్ల నగదు తరలిస్తుండగా పట్టుకున్నామని సెబ్ అనంతపురం జిల్లా అడిషినల్ ఎస్పీ రామక్రిష్ణ, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. విడపనకల్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్, సెబ్ ఎస్‌ఐ రమణారెడ్డి సిబ్బందితో చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పందాల క్రిష్టారెడ్డి వాహనంలో నగదు లభించిందని వారు తెలిపారు. స్థలం కొనుగోలు కోసం బళ్లారి జిల్లా సిరుగుప్ప నుంచి బెంగళూరుకు నగదు తీసుకువెళుతున్నామని క్రిష్టారెడ్డి తెలిపారని, కానీ ఆధారాలు లేకపోవటంతో నగదు, కారును సీజ్ చేసి కేసు నమోదు చేశామని అన్నారు. తదుపరి చర్యల నిమిత్తం నగదును ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగిస్తున్నామని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

కొట్లాడుదాం.. ఆంధ్రా..!

కళ్యాణదుర్గం, జనవరి 18: ఆడుదాం ఆంధ్ర పేరిట జిల్లాలో జరుగుతున్న క్రీడా పోటీల్లో నిత్యం ఏదో ఓ చోట గొడవలు జరుగుతున్నాయి. తాజాగా కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం జరిగిన మండల స్థాయి కబడ్డీ సెమీ ఫైనల్స్‌లో ఘర్షణ చోటు చేసుకుంది. కంబదూరు సచివాలయం-2, తిమ్మాపురం సచివాలయం-1 జట్ల మధ్య పోటీ జరుగుతుండగా.. కంబదూరు జట్టు రెండు పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ సమయంలో రెండు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం మొదలై.. కొట్టుకునే దాకా వెళ్లింది. బయట ఉన్న మద్దతుదారుల సైతం మైదానంలోకి వెళ్లి కుర్చీలు, రాళ్లు విసురుకున్నారు. దీంతో ఇద్దరు గాయపడ్డారు. ఉద్రిక్త వాతావరణం ఏర్పడటంతో వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అందరినీ చెదరగొట్టారు. ఆటను శుక్రవారానికి వాయిదా వేశారు.



ఘర్షణకు దిగిన క్రీడాకారులు, ఆయా గ్రామాల ప్రజలు

జనాలపై జగన్ భస్మాసుర హస్తం

సీఎంపై మండిపడ్డ అంగన్‌వాడీలు

38వ రోజు కొనసాగిన నిరసనలు

అనంతపురం విద్య, జనవరి 18: రాష్ట్ర ప్రజలపై సీఎం జగన్ భస్మాసురహస్తం ప్రయోగించారని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద తలపై 'భస్మాసుర హస్తం' పెట్టుకుని నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 38వ రోజు గురువారం ఆందోళనలు కొనసాగించారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపైకి వచ్చిన నిరసన తెలిపారు. అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు జగన్ మాస్క్ ముఖానికి వేసుకుని, కార్యకర్తలు, ఆయాల తలపై పెట్టి.. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. చెన్నేకొత్తపల్లిలో వేపాకు తింటూ నిరసన తెలిపారు. గుత్తిలో రోడ్లపై భిక్షాటన చేశారు. గార్లదిన్నెలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు.



తలపై చేయి పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఇంట్లో మనిషి..!

సాంబ అనుచరుడికి శింగనమల టిక్కెట్
నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరాంజనేయులు
మడకశిర ఎమ్మెల్యేకీ షాక్.. లక్కన్నకు లక్

(వివరాలు 7లో..)





హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సాయం

అనంతపురం క్రైం, జనవరి 18 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తూ పలు కారణాలతో మృతి చెందిన 28మంది హోంగార్డుల కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ గురువారం ఆర్థిక సాయం అందించింది. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతులమీదుగా ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున రూ.2.80లక్షల చెక్కులను అందజేశారు. ఇప్పటికే వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం కింద హోం గార్డుల ఉద్యోగాలు ఇచ్చారు. ఏఆర్ అదనపు ఎస్పీ హనుమం తు, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐ హరికృష్ణ, ఆర్ఎస్ఐ మగ్బూల్ బాషా పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఈఓ వైఖోమ్ నైదియా దేవి

అనంతపురం విద్య, జనవరి 18: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓగా వైఖోమ్ నైదియా దేవి గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టుకు ఇటీవల ఐఏఎస్ అధికారి అయిన ఆమెను నియమిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అనంతపురం జిల్లా పరిస్థితులు, జడ్పీ పాలనా వ్యవహారాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (డీఎల్‌డీఓ), ఎంపీడీఓలు, జడ్పీ అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

- ఉపాధ్యాయులవైపే కమిషన్ మొగ్గు
- ఎన్ఐసీకి చేరిన టీచర్ల డేటా
- పీఓ, ఏపీఓల నియామకానికి ఏర్పాట్లు
- అంగన్‌వాడీల స్థానంలో సచివాలయ సిబ్బంది..



అనంతపురం టౌన్, జనవరి18: ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు ఓటర్ల ఫిర్యాదులు, పరిశీలన, పోలింగ్ కేంద్రాలు, వసతులపై అధికారులు కుస్తీ పట్టారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అవసరమైన సిబ్బందిని నియమించి వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో సిబ్బంది నియామకానికి కసరత్తు మొదలైంది. ఈ సారి ఉపాధ్యాయులను దూరం పెట్టాలని సీఎంతో సహా పలువురు ఉన్నతాధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే కేంద్ర ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయులకు విధులు కేటాయించాల్సిందేనని ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఉపాధ్యాయుల వివరాలను సేకరిస్తోంది. ప్రభుత్వ, మున్సిపల్, జిల్లాపరిషత్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న అన్నికేడర్ల టీచర్ల వివరాలను పంపించాలని విద్యాశాఖాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సేకరించిన జాబితాను గురువారం విద్యాశాఖ ఎన్ఐసీ సెంటర్‌కు పంపించారు. మొత్తం అన్నివిభాగాల్లో కలిపి 9,400 మంది ఉపాధ్యాయులు జాబితాలో ఉన్నారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఆయావిభాగాల ఉన్నతాధికారుల ద్వారా డేటాను ఎన్ఐసీ తెప్పించుకుంది. వారి కేడర్‌ను బట్టి ఎన్నికల విధులు అప్పగించనున్నారు. ప్రధానంగా అధికార కేడర్‌గల వారిని రూట్ ఆఫీసర్లు గా, పర్యవేక్షణాధికారులుగా నియమిస్తారు. అత్యంత కీలకమైన పీఓ, ఏపీఓలను ఉపాధ్యాయులనే నియమించనున్నారు. గతంలో ఏపీఓలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండేవారు. వారి స్థానంలో ఈసారి సచివాలయ ఉద్యోగులను నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష టీడీపీ సచివాలయ ఉద్యోగులను ఎన్నికలకు నియమించకూడదని న్యాయస్థానంలో కేసువేసింది. న్యాయస్థానం తీర్పును బట్టి ఏపీఓల నియామకం ఉంటుందంటున్నారు. జిల్లాలో ఈసారి 2,213 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈకేంద్రాలకు దాదాపు 11 వేలమందివరకు సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నారు. ఈమేరకు కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. వారంలోపే ఈప్రక్రియ పూర్తి చేసి, శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తానికి అధికారుల్లో ఎన్నికల అలజడి మొదలైందని చెప్పవచ్చు



కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్

రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల

అనంతపురం టౌన్, జనవరి 18: జిల్లాలో 8,697మంది గృహ లబ్దిదారుల రుణాలకు వడ్డీ రీఎంబర్స్‌మెంట్ విడుదల చేసినట్లు కలెక్టర్ గౌతమి గురువారం వెల్లడించారు. నవరత్నాలు-అందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లు నిర్మించుకున్నవారికి రాష్ట్రవ్యాప్తంగా నిధులు విడుదల చేశారు. అందులో బాగంగా జిల్లాకలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా లబ్దిదారులకు సొమ్మును విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 53,426 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ188కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులోఅర్హులైన 8,697మందిసభ్యులకు రూ.85.58 లక్షల వడ్డీ మంజూరైందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ మంగమ్మ, డీఆర్‌డీఏపీడీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

ఉరవకొండ, జనవరి18: సీఎం పర్యటన నేపథ్యంలో ఉరవకొండలో ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. పట్టణ శివారు అనంతపురం రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న స్థలాన్ని, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలోని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న సీఎం ఉరవకొండకు రానున్నారని, వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం రానున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దారు శ్రీధర్ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు

అనంతపురం విద్య, జనవరి 18 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో నవోదయ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఏసీ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ...20వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని, 34 కేంద్రాల పరిధిలో 8857 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు,సీఎస్‌లు, డీఓలు పాల్గొన్నారు.

పొలంలో ఘోరం

- విద్యుదాఘాతంతో తండ్రీకొడుకుల మృతి



తండ్రి, కొడుకు మృతదేహాలు



రైతు బయపరెడ్డి (ఫైల్)



రాజారెడ్డి (ఫైల్)

నార్పల, జనవరి 18: వేరుశనగ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన తండ్రీకొడుకులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటన నార్పల మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బయపరెడ్డి(42), ఆయన కుమారుడు రాజారెడ్డి(18) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బయపరెడ్డికి మూడున్నర ఎకరాల పొలం ఉంది. అందులో బోరుబావి కింద వేరుశనగ సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు గురువారం తెల్లవారు జామున కుమారుడు రాజారెడ్డితో కలిసి బైక్‌పై వెళ్లాడు. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ బాక్సును ముట్టుకోగానే బయపరెడ్డి తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రిని కాపాడే క్రమంలో రాజారెడ్డి కూడా షాక్‌కు గురయ్యాడు. వారి అరుపులు విన్న పక్క పొలం రైతులు వెళ్లి చూసేసరికి ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. స్టార్టర్ బాక్సుకు విద్యుత్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పొలానికి చేరుకుని గుండె లవిసేలా రోదించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పండుగ సెలవులకు వచ్చి..

రైతు బయపరెడ్డికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాజారెడ్డి హైదరాబాదులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. కాలేజీకి గురువారం వెళ్లాల్సి ఉంది. తండ్రి పొలానికి వెళుతుండటంతో సరదాగా వెంట వెళ్లాడు. తండ్రిని కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయాడు. తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. రైతు భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సిట్టింగులకు షాక్



- శింగనమలకు వీరాంజనేయులు
- మడకశిరకు ఈర లక్కప్ప
- ఇన్‌చార్జిలను ప్రకటించిన వైసీపీ



ముఖ్యమంత్రితో వీరాంజనేయులు, సాంబ

అనంతపురం క్రైం/పుట్టపర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మరో ఇద్దరు సిట్టింగులకు వైసీపీ అధినాయకత్వం షాక్ ఇచ్చింది. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్థానంలో వీరాంజనేయులును, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి స్థానంలో ఈర లక్కప్పను నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా నియమించింది. వచ్చే ఎన్నికల్లో వీరే ఎమ్మెల్యే అభ్యర్థులన్నది సుస్పష్టం. శింగనమల అభ్యర్థి పేరు ప్రకటించగానే.. 'ఎవరబ్బా..?' అని జనమే కాదు.. అధికార పార్టీ శ్రేణులు కూడా చర్చించుకునే పరిస్థితి. సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డికి అనుచరుడు వీరాంజనేయులు. ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల భర్త. సాంబశివారెడ్డి ఏం చెబితే అది వీరు చేస్తారన్న ప్రచారం ఉంది. వీరాంజనేయులు స్వగ్రామం శింగనమల మండలం బండమీదపల్లి. ఆయన తండ్రి వెంకటప్ప చక్రాయపేట పంచాయతీకి మాజీ సర్పంచ్. వీరాంజనేయులు కొర్రపాడు ఇసుక రీచ్‌కు ఏపీఎండీసీ మేనేజర్‌గా పనిచేసేవారు. ఈ ఇసుక రీచ్‌లన్నీ సాంబ పరిధిలోనే ఉన్నాయి.

ఎవరీ ఈర లక్కప్ప?

వైసీపీలో సాధారణ నాయకుడు ఈర లక్కప్ప. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామిని పది రోజుల క్రితం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాయాలనికి పిలిపించుకున్నారు. టిక్కెట్ లేదని చెప్పి పంపించారు. కొత్త అభ్యర్థికి సహకరించాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లాకు చెందిన సీఐ శుభకుమార్‌ను బరిలో దింపుతారని ప్రచారం జరిగింది. అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ తరఫున 2003-2008 మధ్య గుడిబండ సర్పంచ్‌గా ఎన్నికైన ఈర లక్కప్పకు అవకాశం ఇచ్చారు. వైసీపీలోనే ఉన్నా, పెద్దగా గుర్తింపు లేని ఈర లక్కప్పను తెరపైకి తీసుకువచ్చారు. ఆయన ఎంపికపై ఎమ్మెల్యే వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు మాత్రం సంబరాలు చేసుకుంటున్నారు.



లక్కప్ప

శింగనమల నుంచి ఈసారి అవకాశం లేదని మొదట్లోనే పద్మావతికి సీఎం జగన్ చెప్పేశారు. మాదిగ సామాజికవర్గానికి సంబంధించిన వ్యక్తిని ఎంచుకోమని ఆమెకే సూచించారనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలో సాంబశివారెడ్డి అనుచరుడు వీరాంజనేయులును ప్రతిపాదించారని సమాచారం. ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలుత డీఎస్పీ శ్రీనివాసమూర్తి పేరు వినిపించింది. మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ఆమె సోదరుడు అశోక్ పేరు కూడా తెరపైకి వచ్చాయి. ఈ పేర్లను సైతం సాంబశివారెడ్డి ప్రతిపాదించారు. ఈ ఇద్దరి పేర్లను పార్టీ తిరస్కరించింది. సంక్రాంతికి ముందు నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల పేరును తీసుకొచ్చారు. అప్పటికప్పుడు ఆమెను విజయవాడకు ఓ వాహనంలో తీసుకెళ్లారు. ఆమె వయసు తక్కువగా ఉందని తిరస్కరించారట. ఎటూ పాలుపోక ప్రమీల భర్త వీరాంజనేయులును సీఎం దగ్గరికి తీసుకెళ్లి పుష్పగుచ్ఛం అందజేయించారు. అలా సమన్వయకర్తగా నియమించారు.

చేనేత ఆత్మహత్యలను నివారిస్తా

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, జనవరి 18: ధర్మవరం పట్టణంలో చేనేతల ఆత్మహత్యలను పూర్తిగా నివారిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఇటీవల పట్టణంలో ఐదు రోజులపాటు నిర్వహించిన పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారన్నారు. ఇందులో ప్రధానమైనది చేనేత పరిశ్రమ అని తెలిపారు. అందుకే నా మొదటి ప్రాధాన్యం హ్యాండ్‌లూమ్‌ను కాపాడడమేనని చెప్పారు. చేనేత మగ్గాలు నేసిన వారికి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, వీలైతే అద్దెలు కూడా ప్రభుత్వమే భరించేలా చూస్తామని తెలిపారు. నేత కార్మికులు నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, రాయితీలు పునరుద్ధరిస్తామని, వారికి ప్రత్యేక గుర్తింపుకార్డులు ఇచ్చి ఎలాంటి నిబంధనలు లేకుండా అన్ని రకాల పథకాలు వర్తింపచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మరీ ముఖ్యంగా నారాలోకేశ్ చేనేత రంగాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారని, చేనేతలకు ఎలాంటికష్టనష్టాలు లేకుండా హ్యాండ్‌లూమ్ వ్యవస్థను కాపాడుతారని పేర్కొన్నారు. మరోవైపు ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కుటుంబాలను, వారి పిల్లలను ఆదుకునేందుకు ప్రత్యేక కమిటీ వేస్తామన్నారు. అదేవిధంగా ధర్మవరంలో వేలాది మంది మహిళలు ఉపాధి లేకుండా దుర్భర జీవితం గడుపుతున్నారని, వారికోసం టీడీపీ అధికారంలోకి రాగానే స్టిచ్చింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఇళ్లు, ఇళ్లస్థలాలు, పింఛన్, రేషన్‌కార్డులు లేని వారికి అవన్నీ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, విద్యుత్, శ్మశాన వాటికలు, రోడ్లు, డ్రైనేజీలు లేనిచోట వాటి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వీటిపై నాలుగున్నర ఏళ్లగా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. ధర్మవరంలో వ్యాపారాలు చేసుకునే వారికి టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మరో వైపు టికెట్ విషయంలో పుకార్లు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కచ్చితంగా ధర్మవరంలో టీడీపీజెండా ఎగురవేసేది తానేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, పరిశేసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై అణచివేత తగదు : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

అనంతపురం విద్య, జనవరి 18: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వం అణచివేత ధోరణి సరికాదని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. గురువారం ఉపాధ్యాయభవన్‌లో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు 2023 జులై నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా 11వ పీఆర్సీ బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. డీఏ బకాయిలు, సరెండ్ లీవ్స్, పీఎఫ్ రుణాలు తక్షణమే చెల్లించాలన్నారు. అదేవిధంగా జీవో 117 రద్దు చేయాలని, వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, లేనిపక్షంలో 31న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు సతీష్ కుమార్, సర్ధార్ వలి, వన్నప్ప, లక్ష్మినారాయణ, రామ్మోమన్, రంగనాయకులు, వేణుగోపాల్, శాంసన్, ఓబులేసు, నస్తుల్లాహ్ పాల్గొన్నారు.

బేషరతుగా కేసులు ఎత్తివేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ఉరవకొండ, జనవరి18: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులపై నమోదైన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా చూస్తోందని, కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. జీతాలు ఇవ్వకపోతే ఎలా పనిచేస్తారని, జీతాలు అడిగినందుకు కార్మికులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం తగదన్నారు. ఎంపీ తలారి రంగయ్య ఆదేశాల మేరకే డీఈ, సర్పంచు భర్త మోటార్లు ఆన్ చేశారని, దీంతోనే పైపులు పగిలి పోయాయన్నారు. వారిపై కేసులు నమోదు చేయకుండా కార్మికులపై కేసులు పెట్టడం తగదన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. అక్రమ కేసులు ఎత్తి వేయాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, శ్రీనప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

మహిళ హత్య



లక్ష్మీదేవి (ఫైల్)

ముదిగుబ్బ, జనవరి18: మండలంలోని దొరిగల్లు అటవీ ప్రాంతంలో అనంతపురంలోని రామ్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి(53)ని ఈనెల 16న హత్య చేశారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన లక్ష్మీదేవి భర్త వెంకటేశ్వరబాబు 6 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి లక్ష్మీదేవి చిట్టీలు నడుపుకుంటూ జీవనం సాగించేది. అనంతపురానికి చెందిన ఆదినారాయణతో పరిచయం ఏర్పడడంతో రూ.5లక్షలు అప్పు తీసుకుంది. ఆ తర్వాత వారి పరిచయం వివాహేతర బంధానికి దారి తీసింది. తరచూ దొరిగల్లు అటవీ ప్రాంతానికి వచ్చేవారు. అనంతపురానికి చెందిన మరో వ్యక్తి విశ్వనాథ్‌తో ఆమె సన్నిహితంగా మెలగడంతో ఆదినారాయణ తాను ఇచ్చిన రూ.5 లక్షలు తిరిగివ్వాలని డిమాండ్ చేశాడు. లక్ష్మీదేవి, విశ్వనాథ్ కలిసి ఆదినారాయణను బెదిరించారు. లక్ష్మీదేవిని హత్య చేయాలని నిర్ణయించుకున్న ఆదినారాయణ ఆమెకు మాయ మాటలు చెప్పి, మంగళవారం తరచూ వచ్చే దొరిగల్లు అటవీ ప్రాంతానికి, ద్విచక్ర వాహనంలోనే తీసుకువచ్చారు. అక్కడ ఆమెను చీరతోనే మెడకు బిగించి హత్య చేసి అక్కడ నుంచి పరారయ్యారు. లక్ష్మీదేవి ఇంట్లో కనిపించలేదని, ఆమె రెండవ కుమార్తె నందిని అనుమానంతో ఆదినారాయణకు ఫోన్ చేసింది. మీ అమ్మ డబ్బులు ఇవ్వకుండా, బెదిరిస్తుండడంతో దొరిగల్లు అటవీ ప్రాంతంలో హత్య చేశానని పేర్కొన్నారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురం పోలీసులు ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మృతురాలిని గుర్తించి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, నిందితు ని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

టీడీపీతోనే రైతులకు న్యాయం

అధికారంలోకి రాగానే పట్టు రైతుకు ప్రోత్సాహకం: అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురం అర్బన్, నవంబరు 18: టీడీపీతోనే రైతులకు సంపూర్ణ న్యాయం సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రైతులకు ప్రోత్సాహకం అందేలా చూస్తామని టీడీ పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. గురువారం స్థానిక పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా రైతులు, పట్టు రీలర్లు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 20న హిందూపురం రానున్నారని, రైతుల సమ్మెకు ఆయన మద్దతు ఇస్తారన్నారు. రైతులు చేస్తున్న పోరాటం వందశాతం ఆమోదయోగ్యమైనదని అందుకు టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. గత ఎన్నికల ముందు రైతులకు ప్రోత్సాహకం ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ రైతులను నిలువునా ముంచారన్నారు. 2019 నుంచి రైతులకు రావాల్సిన ప్రోత్సాహక బకాయిలు రూ.67 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లకుంట అంజినప్ప, లాయర్ శివకుమార్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, మడకశిర సోమశేఖర్, పరిగి రాజేష్, నవీన్, జయరాంరెడ్డి, శంకర్, హనుమంతరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, అదే విధంగా రైతులకు బిజెపి పార్టీ రాష్ట్ర నాయకుడు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమానుల్లా, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భిక్షాటన

పట్టణంలో పట్టురైతులు శుక్రవారం భిక్షాటన చేపట్టనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి ఆయన పిలుపునిచ్చారు.

కొనసాగిన సమ్మె

ధర్మవరం: ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ గురువారం స్థానిక సెరికల్చర్ కార్యాలయం వద్ద పట్టు రైతులు, రీలర్లు సమ్మె చేపట్టారు. సమ్మెకు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులు సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన చేశా రు. అనంతరం జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. 2017 నుంచి ఇన్సెంటివ్ రావాల్సి ఉంటే గతంలో చేసిన ఆందోళనకు కొద్దిగా విడుదల చేశారన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు ధర్మవరం పట్టుగూళ్ల మార్కెట్‌కు సంబంధించి రూ.10కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. మూడేళ్లు గడుస్తున్నా మూడు రూపాయలు కూడా ప్రోత్సాహకం విడుదల చేయలేదని మండిపడ్డారు.



మోకాళ్లపై నిలబడి పట్టు రైతులు, రీలర్ల నిరసన

గొర్రెల మందపై దూసుకెళ్లిన బొలెరో.. 28 జీవాల మృతి



మృతి చెందిన గొర్రెలు



ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం

కళ్యాణదుర్గం, జనవరి 18: గొర్రెల మందపై బొలెరో వాహనం దూసుకెళ్లడంతో 28 జీవాలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని గూబనపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో 28 గొర్రెలు మృతి చెందగా మరో 30 తీవ్రంగా గాయపడ్డాయి. కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామానికి చెందిన మారెప్ప తన 500 గొర్రెలను మేత కోసం కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి తరలిస్తున్నాడు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో గూబనపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం మందపైకి దూసుకెళ్లింది. దీంతో గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 30 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ రోడ్డు పక్కన వాహనాన్ని వదిలి పరారయ్యాడు. సుమారు రూ. ఆరు లక్షల వరకు నష్టం జరిగినట్లు గొర్రెల కాపరి మాదవయ్య తెలిపారు. గొర్రెల యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఉద్యోగ సమస్యలపై స్పందన

అనంతపురం టౌన్, జనవరి18: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సాయంత్రం 4గంటలకు జరిపే స్పందనలో ఉద్యోగులు తమ సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.





అనంతపురం లలితకళాపరిషత్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభాకర్ చౌదరి, రక్తదానం చేస్తున్న అభిమానులు, నీలారెడ్డిపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆలం, ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు



నీలారెడ్డిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బండారు శ్రావణీశ్రీ






ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేఎం జకీవుల్లా, రాయల్ మురళీ, అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు, టీడీపీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తెలుగు మహిళలు, జిల్లా గ్రంథాలయం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగు మహిళలు



నీలారెడ్డిపల్లిలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో..

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ ముఖ్యనాయకులు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు సరిపూటి సూర్యనారాయణ, గడ్డం సుబ్రమణ్యం, బాంబే డయింగ్ నాగన్న, గాజుల ఆదెన్న, విశాలాక్షి, వెంకటప్ప, కుంచెపు వెంకటేష్, రాజారావు, నెట్టెం బాలకృష్ణ ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో స్థానిక లలిత కళాపరిషత్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 100 మంది రక్తదానం చేశారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బెడ్డు పంపిణీ చేశారు. అనంతరం సాయి నగర్‌లో అన్నదానం నిర్వహించారు. లలితకళాపరిషత్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. సినీనటులు శివాజీ, నాగినీడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతపురంరూరల్ మండలం కురుగుంటలోని అంధ ఆశ్రమంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. బుక్కరాయసముద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్‌రాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణీశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి, శింగనమలలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, గార్లదిన్నెలో ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్టయ్య, నార్పలలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు ఆధ్వర్యంలో, రాప్తాడు టీడీపీ కార్యాలయంలో నాయకులు నివాళులర్పించారు. అలాగే రామగిరి, చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు, కనగానపల్లిలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.



గార్లదిన్నెలో నివాళులర్పిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి



ఆత్మకూరు పార్టీ కార్యాలయం వద్ద నాయకుల నివాళి



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ స్వరూప



నార్పలలో నివాళులర్పిస్తున్న ఆలం వెంకట నరసానాయుడు




కురుగుంట అంధుల ఆశ్రమంలో నాయకులు, ఎస్కేయూ వద్ద అధ్యాపకులు, అధికారులు నివాళులర్పిస్తున్న దృశ్యం



సంతోష్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



రాప్తాడు టీడీపీ కార్యాలయంలో ...



పంగల్‌రోడ్డులోని అనాథాశ్రమంలో బ్రెడ్లు పంచుతున్న నాయకులు



గుమ్మేపల్లిలో నివాళులర్పిస్తున్న దేగల కృష్ణమూర్తి, లలితమ్మ



శింగనమలలో దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో...



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నివాళులర్పిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు




రామగిరిలో అంగన్‌వాడీలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, సీకేపల్లిలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కనగానపల్లి ప్రభుత్వాసుపత్రిలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



ముక్తాపురంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రణాళిక



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దంపెట్ల శివ, శ్రీరాములు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18: కొత్త సంవత్సరంలో పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదుకోవాలని ప్రణాళికతో ముందుకు వెళ్తామని ముక్కోటి అంబిక సేవా చారిటబుల్ ట్రస్టు దంపెట్ల శివ తెలిపారు. గురువారం స్థానిక ముక్కోటి అంబిక సేవా చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. సేవతోనే జీవితానికి సార్థకత, గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కో-ఆర్డినేటర్లు ఆర్‌పీఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, కాపుసేన తోట ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్కేయూ వీసీని కలిసిన ప్రిన్సిపాళ్లు



వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రిన్సిపాళ్లు

అనంతపురంరూరల్/ సెంట్రల్, జనవరి 18: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన వీసీ హుస్సేన్‌రెడ్డిని బాలాజీ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు ఎస్కేయూలో గురువారం కలిశారు. బాలాజీ విద్యాసంస్థలోని ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మునిక్రిష్ణారెడ్డి, ఎంసీఏ కళాశాల ప్రిన్సిపాల్ మన్మ ధేశ్వర్‌రెడ్డి, పీవీకేకే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీర ప్రకాష్ వీసీని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ సిబ్బందికి ఎస్పీ సన్మానం

అనంతపురం క్రైం, జనవరి 18: ఓ కేసుకు సంబంధించి శిక్ష పడేలా కృషి చేసిన స్పెషల్ పీపీ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ గురువారం తన చాంబర్‌లో సన్మానించారు. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామంలోని చిన్న చౌడప్ప హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ ఈనెల 8న జిల్లా జడ్జి శ్రీనివాస్ తీర్పు ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో నిందితులకు శిక్షపడేందుకు కృషి చేసిన స్పెషల్ పీపీ హరినాథ్‌రెడ్డి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు రాంమోహన్, సుంకన్నను ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ డే

అనంతపురం సెంట్రల్ : వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎస్కేయూలో నేహ్రూయువజన కేంద్రం ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎస్కేయూ ఎన్ ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ.. ఈ పోటీ ప్రపంచంలో చదువు ఒక్కటే కాకుండా వ్యక్తిగత నైపుణ్యం కూడా చాలా అవసరమన్నారు. ఇందులో ఎస్కే యూ కాప్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ జిసోమశేఖర్, ప్రోగ్రాం అధికారి సత్య సౌమ్య పాల్గొన్నారు.

ఆర్డీటీకి స్థల విరాళం

అనంతపురం క్లాక్‌టవర్ : తాడిపత్రి మండలం పొలమడ గ్రామపంచాయతీలో ఆర్డీటీ పాఠశాల నిర్మాణానికి పది సెంట్ల స్థలాన్ని తిప్పిరెడ్డి వాసంతి నాగార్జునరెడ్డి దంపతులు విరాళంగా ఇచ్చారు. గురువారం స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌కు దస్త్రాలను అందజేశారు.

చెత్త విషయంలో ఉపేక్షించేది లేదు: కమిషనర్

అనంతపురం క్రైం, జనవరి 18: నగరంలో చెత్త సేకరణ విషయంలో పనిని కార్మికులపై వదిలేసి ప్రేక్షకపాత్ర పోషిస్తే ఉపేక్షించేది లేదని నూతన నగర కమిషనర్ మేఘ స్వరూప్ హెచ్చరించారు. గురువారం కమిషనర్ తన చాంబర్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సైతం చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా కార్మికులకు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఈఈ సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శిగా వెంకటేశులు

అనంతపురం క్లాక్‌టవర్ / రాప్తాడు: బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా వెంకటేశులు ఎంపికయ్యారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు రాష్ట్ర పరిశీలకుడు బాల మద్దిలేటి, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, ఎన్నికల అధికారి రామాంజనేయ చౌదరి గురువారం తెలిపారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడుగా గౌస్‌మొద్దీన్, కార్యదర్శులుగా వెంకటేశులు, వెంకట నారాయణలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆత్మకూరు, జనవరి 18: మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మాజీ సర్పంచ్, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి గురువారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణ గోపాల్, తిమ్మప్ప, చంద్రశేఖర్, ఓబుళేసు, సుబ్బరాయుడు, నాగన్న పాల్గొన్నారు.

విధుల్లో, అవార్డుల్లో ప్రాధాన్యం ఇవ్వండి

అనంతపురం విద్య, జనవరి 18 : విద్యాశాఖ,సమగ్రశిక్ష ప్రాజక్టు నిర్వహించే వివిధ కార్యక్రమాల విధుల్లోనూ, రిపబ్లిక్ డే అవార్డుల్లోనూ ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఎంఈఓ, హెచ్‌ఎం సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తారా చంద్రానాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, గౌరవాధ్యక్షుడు పురుషోత్తం, ఇతర నేతలు ఏపీసీ వరప్రసాద్, ఏసీ గోవింద్ నాయక్, అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్ రావ్, అధికారులను వేర్వేరుగా కలిశారు.

చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

అనంతపురం విద్య : సీపీఐ అనుబంధ ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. గురువారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. జిల్లా గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా గోవింద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కాసుల రామాంజినేయులు, ఆఫీస్ బేరర్స్‌గా శ్రీనివాసులు, పురుషోత్తం, వెంకటరాముడు, మధు, మల్లికార్జున, ఎర్రిస్వామి, రామాంజినేయులు, సి. శ్రీనివాసులు, ఈడిగ వెంకటరాముడు, హరికృష్ణ మరో 21 మంది కార్యవర్గ సభ్యులు, మరో 60 మంది సమితి సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

అమ్మ ఆర్థిక సాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్ : స్థానిక ఫెర్రర్‌కాలనీలో నివాసముంటే శశికళ భర్తను పోగొట్టుకొని కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి గురువారం ఆమె ఇంటికి వెళ్లి.. ఆ కుటుంబానికి రూ. 30 వేలు ఆర్థికసాయం, రూ. 30 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ. 15 వేలు విలువ చేసే దుస్తులు అందించారు.

ప్రకాష్ రెడ్డీ.. నీ టికెట్ సంగతి చూసుకో..!

శునకానందం మానుకో..
: మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, జనవరి 18: ' తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి టికెట్ వస్తుందో.. రాదో అనే భయం పట్టుకుంది. దీంతో తెలుగుదేశం పార్టీలో టికెట్ల మీద కామెంట్లు చేస్తూ శునకానందం పొందుతున్నాడు. రాప్తాడులో తెలుగుదేశం పార్టీ టికెట్ ఎవరికి ఇవ్వాలో చంద్రబాబుకు బాగా తెలుసు. ముందు నీ టికెట్ సంగతి ఎంటో చూసుకో.. ' అంటూ రాప్తాడు ఎమ్మెల్యేపై మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. గురువారం మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని నందమూరి నగర్‌లో స్థానిక నాయకులతో కలసి బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఆమె మాట్లాడుతూ.. ఇక ప్రకాష్‌రెడ్డికి ఈ శునకానందం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని, ఇలాంటి కథనాలు రాయించే దానిపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచి చేసే దానిపై ఉండి ఉంటే బాగుండేదని హితవు పలికారు. కనీసం ఉన్న ఈ రెండు నెలలైనా ప్రజలకు మంచి చేసే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాప్తాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ పవన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మాజీ మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, చల్లా జయకృష్ణ, జనసేన మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ సర్పంచు సుశీలమ్మ, నాయకులు నాగముని, పతక మూరి శ్రీనివాసులు, నాగభూషణచౌదరి, మనోహర్‌నాయుడు, ప్రకాష్, రత్నమ్మ, రంగనాయకులు, సూరి, రాము, వెంకటేష్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

రాప్తాడు : మండలంలోని బండమీదపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. అనంతపురం నగరంలోని పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. తోపుదుర్తి నరసింహులు, గాజుల లక్ష్మీనారాయణ, గంట్ల నారాయణస్వామి, అంకే తిమ్మరాజు, అంకే కదిరప్ప, అంకే వంశీ, అంకే హరిక్రిష్ణ తదితరులు టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, నాయకులు వెంకట్రాముడు, కిష్టా, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

సదరం క్యాంపు వాయిదా

శింగనమల, జనవరి 18: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ శుక్రవారం నిర్వహించాల్సిన సదరం క్యాంపు వాయిదా వేసినట్లు కమ్యూనిటి హెల్త్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రమణనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపును సోమవారం నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లాకు ఇద్దరు సీఐలు

అనంతపురం క్రైం, జనవరి 18: జిల్లాకు కొత్త ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను నియమిస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం రూరల్ యూపీఎస్‌కు సీఐగా అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను నియమించారు. అదేవిధంగా కర్నూలు జిల్లాలో సీఐగా పనిచేస్తున్న శ్రీధర్‌ను శింగనమల యూపీఎస్‌కు కేటాయించారు.

మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తే పుట్టగతులుండవ్..!

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురంరూరల్, జనవరి 18: వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తే వైసీపీ ప్రభుత్వానికి పుట్టగతులుండవని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణంలో గురువారం రైతులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి.. నేడు మీటర్లు ఏర్పాటు చేయడం జగన్ ప్రభుత్వానికి తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాము, రైతు సంఘం నాయకులు వెంకటరాముడు, గోవిందు నాయక్, నారాయణస్వామి, ఎర్రపోతన్న, రెడ్డప్ప, నాగభూషణం, నరసింహులు, వేణుగోపాల్, సల్మాన్, విజయ్, నాగరాజు, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 18: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్, ఐఎంఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఓ ప్రైవేట్ హోటల్‌లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఐఎంఎం వ్యవస్థాపకుడు మహబూబ్ బాషా మీడియాతో మాట్లాడారు. అన్ని రంగాల్లో ముస్లింలు చాలా వెనుకబడి ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అనంత జిల్లాలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ హమీద్, హ్యూమన్ రైట్స్ దాదు, ఎంఐఎం పార్టీ శర్మవలి, కాంగ్రెస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, టిప్పు సుల్తాన్ అభిమాన అధ్యక్షుడు రహంతుల్లా, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధికార ప్రతినిధి ముక్తియార్, అమ్మ ఆర్గనైజేషన్ నూర్ మహమ్మద్, షేక్షావలి, శ్యామ్ పాల్గొన్నారు.

వేతనాలు అడిగితే కార్మికులపై కేసులా..!

అనంతపురం కల్చరల్ / న్యూటౌన్ , జనవరి 18: నెలల తరబడి ఇవ్వాల్సిన వేతనాలు అడిగినందుకు శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆ పథకం కార్మికులు అనంతపురం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా వద్దకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ హసన్‌బాషా చేరుకుని సీఐటీయూ నాయకులు, కార్మికు లతో చర్చలు జరిపారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని, సమ్మె విరమిం చాలని కోరారు. అయితే వేతనాలు చెల్లించిన తర్వాతే తాము సమ్మె విరమి స్తామని నాయకులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, సీఐటీ యూ నాయకులు ఏజి రాజమోహన్‌రెడ్డి, మన్నీల రామాంజినేయులు, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల యూనియన్ కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, నాయకులు నరేష్, రామాంజినేయులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు అందజేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ ప్రభాకరరెడ్డి (పెద్దవడుగూరు)


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి(తాడిపత్రి)



కళ్యాణదుర్గంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వరనాయుడు


గుంతకల్లులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలను వేసిన జితేంద్రగౌడు, టీడీపీ నాయకులు


పామిడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి


కూడేరు మండలం ఇప్పేరు గ్రామంలో ఎన్‌టీఆర్ వర్ధంతిని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి సందర్భంగా తెలుగు తమ్ముళ్ల, అభిమానులు గురువారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు ప్రజల మదిలో చిరస్మరణీయుడు ఎన్టీఆర్ అని కీర్తించారు. కొన్ని ప్రాంతాల్లో ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుత్తిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు హరినాథ్‌గౌడ్


గుత్తిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటశివుడు యాదవ్


ఆర్ కొట్టాల గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు (యాడికి)


రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు (పుట్లూరు)


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు (యల్లనూరు)


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు (పెద్దపప్పూరు)


బెళుగుప్పలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


ఉరవకొండలో ...


ఎల్‌బీనగర్‌లో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు(బొమ్మనహాళ్)


పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు(రాయదుర్గం)


కణేకల్లులో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

జగన్ పాలనతో రాష్ట్రం అతలాకుతలం

గుంతకల్లు, జనవరి18: అస్తవ్యస్త పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధిపరంగా అతలాకుతలం అయిపోయిందని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డులో గురువారం ఉదయం టీడీపీ, జనసేన నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ పథకాల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్రగౌడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు వార్డులో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గ పరిపాలనలో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటర్లు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ గౌడు, మణి కంఠ, రాంతేజ్ గౌడు, అనిల్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, కేశప్ప, హనుమంతు, ఫజులు, ముక్కన్నగారి రామాంజనేయులు, లక్ష్మీదేవి, జయమ్మ, అంజలి, మాధవి, జనసేన నాయకులు జీవన్, అతిక్, రవి పాల్గొన్నారు.


31వ వార్డులో బాబు ష్యూరిటీ ప్రచార కార్యక్రమంలో జితేంద్రగౌడు, టీడీపీ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

గుంతకల్లుటౌన్: మండలంలోని పులగుట్టపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మురళి గురువారం టీడీపీలోకి చేరాడు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ ఆయనకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు

పట్టణంలో చౌదరి షబ్బీర్ ఖురేషి ఇంట్లో జరిగిన వివాహానికి మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ గురువారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


గుంతకల్లులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పిస్తున్న బండారు ఆనంద్


డీ.హీరేహాళ్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు


గుమ్మఘట్టలో టీటీపీ అతిథి గృహం వద్ద టీడీపీ నాయకుల నివాళి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కళ్యాణదుర్గం, జనవరి 18: దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌కు నియోజకవర్గం నుంచి విశేష స్పందన లభించింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఈ డ్రైవ్‌కు కళ్యాణదుర్గం మున్సిపాల్టీ, ఐదు మండలాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరై రక్తదానం చేశారు. 1003 యూనిట్ల రక్తాన్ని దానం చేయడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గం టాప్‌గా నిలిచింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ నారా భువనేశ్వరమ్మ, ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా వున్నామన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన టీడీపీ సభ్యులు, ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్టు వైద్య సిబ్బంది ఉమామహేశ్వరనాయుడును అభినందిస్తూ అవార్డును అందించారు.


రక్తదానం చేస్తున్న ఉమామహేశ్వరనాయుడు

అభివృద్ధి కావాలంటే టీడీపీ రావాలి


చిన్నారులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి18: మండలం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బస్సుయాత్రలో భాగంగా గురువారం మండలంలోని కొండూరు, వీరన్నపల్లి, నాగలాపురం, కొట్టాలపల్లి గ్రామాల్లో ఆయన పర్యటన సాగింది. ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ప్రభాకర్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఇళ్లపైనుంచి ఆయనపై పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొండూరు గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో తాగునీటి సమస్యపై మల్లేశ్వరి అనే మహిళ జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. సొంత నిధులతో నీటి సమస్య పరిష్కరిస్తానని ప్రభాకర్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. వీరన్నపల్లిలో మురుగునీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో రహదారులపైనే మురికినీరు ప్రవహిస్తోందని లక్ష్మీదేవి అనే మహిళ జేసీ దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే గ్రామంలో మౌలిక సదుపాయాలన్ని కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమ పాలన: జేసీ

యాడికి, జనవరి18: ప్రజా సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చందన, దైవాలమడుగు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పలువురు సీనియర్ నాయకులను కలిసి వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. రాష్ట్రం సుస్థిర అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిందేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారని జేసీ తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, హరినాథ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బాస్కర్, చిన్నోడు, చలమారెడ్డి, సుధాకర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, అమిలినేని శ్రీధర్, లక్ష్మణ్, నరసింహచౌదరి, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి

అంగన్‌వాడీలతోనే ప్రభుత్వ పతనం: సీపీఎం


అంగన్‌వాడీల దీక్షకు సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


యల్లనూరులో సమ్మెకు మద్దతుగా శిబిరంలో కూర్చున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జనవరి18: అంగన్‌వాడీల సమ్మె పట్ల వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, ఇదే వారి పతనానికి కారణమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన దీక్షలకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలో 38రోజులుగా లక్షమంది కార్మికులు సమ్మె చేపట్టడం ఇదే తొలిసారి అన్నారు. అంగన్‌వాడీ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం కార్మికుల ఓట్లు కావాలి కానీ, వారి కష్టాలు మాత్రం కనబడవా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 తర్వాత ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. సీఎం జిల్లా పర్యటనకు వచ్చినపుడు అయినా వైసీపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లి, అంగన్ వాడీ డిమాండ్లు పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు ధనలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.


బొమ్మనహాళ్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


కళ్యాణదుర్గంలో ప్లేట్లలో ఆకులు పెట్టుకుని తింటూ నిరసన చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


మట్టి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు (తాడిపత్రి)


సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు(యాడికి)

మేమూ జగమొండే..!

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మొండి అయితే తాము జగమొండి అని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నినదించారు. నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం 38రోజు వివిధ ప్రాంతాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన కొనసాగించారు. కోటి సంతకాల సేకరణ, భిక్షాటన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీల సమ్మెకు సీఐటీయూ, వామపక్ష నాయకులు సంఘీభావం తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుత్తిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు


గుంతకల్లులో సమ్మె శిబిరం వద్ద సంతకాల సేకరణ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


బెళుగుప్ప సమ్మెలో మాట్లాడుతున్న మండల అధ్యక్షురాలు సత్యవతి

యువకుడి ఆత్మహత్య

డీ.హీరేహాళ్, జనవరి 18: మండలంలోని మురడి గ్రామ పంచాయతీ తమ్మేపల్లి గ్రామంలో అశోక్(19) ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు తమ్మేపల్లి గ్రామానికి పక్కీరప్పకు ఇద్దరు కుమారులు. వారు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పెద్ద కుమారుడు అశోక్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడు తుండేవాడు. మంగళవారం రాత్రి ఇంటి పక్క రూములో నిద్రించిన అశోక్ బుధవారం ఉదయం ఎంత సేపటికి తలుపు తీయలేదు. దీంతో కుటుంబసభ్యులు తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఎస్ఐ రంగడు యాదవ్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కరువు సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

ఉరవకొండ, జనవరి 18: కరువు సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. కరువు బృందం జిల్లాలో పర్యటించి పరిస్థితులను ప్రభుత్వానికి నివేదికలు పంపినప్పటికీ రైతులకు ఇప్పటి వరకూ ఎలాంటి సహాయకచర్యలు గానీ, నష్టపరిహారం గానీ అందించలేదన్నారు. ప్రభుత్వ నిర్వాకంతోనే జీబీసీ రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. టీడీపీ, జనసేన రెండూ బీజేపీకి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, మనోహర్, సుల్తాన్, నారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పర్యటించిన జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి18: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కాల్వగడ్డవీధి, మండలంలోని బుగ్గ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

యాడికి: రోడ్డుప్రమాదంలో మృతిచెందిన నిట్టూరు గ్రామానికి చెందిన కంబగిరిస్వామి కుటుంబ సభ్యులను గురువారం జేసీ అశ్మిత్‌రెడ్డి పరామర్శించారు. కంబగిరి స్వామి మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.


ప్రజలతో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి